రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్

2







2

సబ్‌కలెక్టర్‌కు బీజేపీ నాయకుల వినతి



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## టీటీడీ అన్నప్రసాద ట్రస్టుకు విరాళం

**అక్షరటుడే, ఇందూరు:** తిరుమల తిరుపతి దేవస్థానం అన్నప్రసాద ట్రస్ట్‌కు నిజామాబాద్ నగరానికి చెందిన ఇంజినీర్ కటకం శ్రీనివాస్ రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. ఇందులో భాగంగా మంగళవారం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు చెక్కును అందజేశారు. ఆయన గతంలోనూ విద్యాదానం కింద టీటీడీకి రూ.5 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కటకం లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.




6-1-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


**మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. కాగా.. ఈ జాబితాలు తప్పడ తడకగా ఉన్నాయని వివిధ రాజకీయ పార్టీలు నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జాబితా మొత్తం అయోమయం.. గందరగోళంగా మారాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అఖిలపక్ష సమావేశాల్లో పార్టీల నేతలు అధికారులను నిలదీశారు. ఓటర్ల జాబితా రూపొందించడంలో నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క వార్డులోని ఓటర్లు మరో వార్డులోకి మారాయి. అంతేకాకుండా పలుచోట్ల ఇతర జిల్లా, ప్రాంతాల ఓటర్లు కనిపించాయి. దీంతో అధికారులు జాబితాలను సవరిస్తామని చెబుతున్నారు.**

– అక్షరటుడే, నెట్ వర్క్






# అయోమయం.. గందరగోళం

■ తప్పులతడకలా ఓటర్ల జాబితాలు ■ ఇతర జిల్లాలు, ప్రాంతాల ఓట్లు వచ్చి చేరిన వైనం ■ రాజకీయ పార్టీల నాయకుల అభ్యంతరం

### ఆర్మూర్ పట్టణంలో..







**ఆర్మూర్:** ఆర్మూర్ పట్టణంలోని 6వ వార్డు పరిధిలోని ఓటర్ల జాబితాలో ఏకంగా నిర్మల్ జిల్లా సోన్, నిజామాబాద్ నగరంలోని బోర్గాం(పి) ఓటర్ల పేర్లు నమోదయ్యాయి. వార్డు పరిధిలోని గోల్ బంగ్లా ప్రాంతంలో కూలిపోయిన ఇంటి నంబరుపై 18 మంది ఓటర్లు ఉన్నట్లుగా నమోదైంది. 3వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ ఓట్లు పక్కనే ఉన్న 19వ వార్డులో నమోదయ్యాయి. 19వ వార్డులోని జర్నలిస్టు కాలనీ ఓటర్ల జాబితాలో ఆ పక్కనే ఉన్న శాస్త్రి నగర్ కాలనీ ఓట్లు నమోదయ్యాయి.

### బోధన్ మున్సిపాలిటీలో..

**బోధన్ :** బోధన్ మున్సిపాలిటీ పరిధిలోనూ ఒక వార్డు నుంచి మరో వార్డు ఓట్లు షిఫ్ట్ అయ్యాయి. 27వ వార్డు నుంచి దాదాపు 200 ఓట్లు పక్కనే ఉన్న 32 వార్డులో షిఫ్ట్ అయినట్లుగా తెలుస్తోంది. అదేవిధంగా గోశాల ఉన్న వార్డులు సుమారు 60 ఓట్లు పక్కవాళ్లు నమోదైనట్లు తేలింది. దీంతో పాటు మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన వారిని కూడా ఓటరు జాబితాలో చేర్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. శక్కర్ నగర్ పరిధిలోని మూడో వార్డులో సుమారు 150 నుంచి 200కు పైగా దొంగ ఓట్లు నమోదైనట్లు తెలుస్తోంది. ఒక్కో డోర్ నెంబర్‌పై పదుల సంఖ్యలో ఓట్లు నమోదైనట్లు స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు.









### భీమ్‌గల్ పట్టణంలో..

**భీమ్‌గల్:** మున్సిపాలిటీ పరిధిలో పారదర్శకంగా ఉండాల్సిన ఓటరు జాబితా గందరగోళంగా మారింది. పట్టణ ఓటరు జాబితాలో ఇతర మండలాలు, మున్సిపాలిటీలకు చెందిన ఓటర్ల పేర్లు భారీగా చేరాయి. బాబాపూర్ గ్రామానికి చెందిన ఓటర్లు (ఉదా: సీరియల్ నెం. 464) భీమ్‌గల్ జాబితాలో దర్శనమిస్తున్నాయి. చౌట్‌పల్లి గ్రామానికి చెందిన ఓటర్లు (సీరియల్ నెం. 357, 356) వంటి ఓటర్లను భీమ్‌గల్ ఓటర్లుగా నమోదు చేశారు. అలాగే జాబితాలో ఉన్న చాలా మంది ఓటర్ల చిరునామాలు నిజామాబాద్ నగరానికి చెందినవిగా ఉన్నాయి. అంతేకాకుండా ఒక వార్డులో ఉండాల్సిన ఓటర్లను మరో వార్డులో చేర్చడంతో పాటు, అసలు సంబంధం లేని ఇతర ప్రాంతాల వారిని ఇక్కడ ఓటర్లుగా చూపించడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

### బాన్సువాడ మున్సిపల్ పరిధిలో..

**బాన్సువాడ:** బాన్సువాడ పట్టణ పరిధిలో విడుదల చేసిన తాజా ఓటరు జాబితాలో తీవ్ర స్థాయిలో తప్పులు చోటు చేసుకున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 19 వార్డులలో దాదాపు అన్ని వార్డుల్లోనూ ఓటరు జాబితా లోపాలతో నిండి ఉంది. ఒకే వార్డులో, ఒకే ఇంటి చిరునామాపై ఒకే వ్యక్తి పేరు రెండు నుంచి మూడు సార్లు నమోదవడం గమనార్హం. అంతేకాకుండా ఒక వార్డుకు చెందిన వందలాది మంది ఓటర్ల పేర్లు మరో వార్డులోకి మార్పు చేశారు. చనిపోయిన ఓటర్లను తొలగించలేదు. ఈ తరహా పొరపాట్లు ఎన్నికల ప్రక్రియపై ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ పార్టీ ప్రతినిధులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### నిజామాబాద్ నగరంలో..

**ఇందూరు:** నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 60 డివిజన్లు ఉన్నాయి. మొత్తం 3.44 లక్షల ఓట్లు ఉన్నాయి. ముసాయిదా ఓటరు జాబితాలో డివిజన్ల వారీగా పరిశీలిస్తే వేల ఓట్లు తారుమారయ్యాయి. ప్రధానంగా ఒక డివిజన్ నుంచి మరో డివిజన్‌కు బదిలీ అయ్యాయి. అలాగే ఇతర జిల్లాలకు, నియోజకవర్గాలకు చెందిన ఓట్లు కూడా దర్శనం ఇవ్వడం విస్మయానికి గురి చేస్తున్నాయి. నగరంలోని 28వ డివిజన్‌లో మొత్తం 5,784 ఓట్లు ఉండగా.. ముసాయిదా జాబితాలో మాత్రం 6503 ఓట్లు చూపిస్తోంది. ఇదే డివిజన్‌కు చెందిన 806 ఓట్లు గల్లంతయ్యాయి. ఈ డివిజన్‌లో గాజుల్‌పేట్, ఖిల్లా రోడ్ కాలనీలు ఉంటాయి. కానీ అర్సపల్లి, ఆటో నగర్, అహ్మద్ పుర కాలనీ, ముజాహిద్ నగర్ కు చెందిన ఓటర్లు వచ్చి చేరారు. అలాగే నగరంలోని ఒకటో డివిజన్ పరిధిలో గల 17వ నంబర్ బూత్‌లో సుమారు వెయ్యి ఓట్లు గల్లంతయ్యాయి. ఇలా ప్రతి డివిజన్‌లో ఓట్ల తారుమారయ్యాయి.

### కామారెడ్డి జిల్లా కేంద్రంలో..

**కామారెడ్డి:** పట్టణంలో మొత్తం 49 వార్డులున్నాయి. ఒక్కో వార్డులో సుమారుగా 200 నుంచి 300 ఓటర్లు ఇతర వార్డు నుంచి బదిలీ చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని 42 వ వార్డులో 112233 ఇంటి నంబరుపై వందలాది ఓట్లు ఉన్నట్టుగా అక్కడి ప్రజలు గుర్తించారు. అయితే ఈ ఇంటిపై ఇప్పటికి బై నంబర్లు లేవని, ఓటరు జాబితాలో మాత్రం బై నంబర్లతో దాదాపు 350కి పైగా ఓటర్లు చేరినట్లుగా తెలుస్తోంది. అలాగే 44వ వార్డులో ఇతర వార్డుల నుంచి ఓటర్లు ఈ వార్డుకు వచ్చినట్టుగా స్పష్టంగా తెలుస్తోంది. ఈ వార్డులో సైలానీ బాబా, ఆర్బినగర్ లాంటి ప్రాంతాల అడ్రస్‌తో ఓటరు జాబితాలో ప్రచురణ కావడం ఉదాహరణగా చెప్పవచ్చు. ఇక 35, 12, 10 వార్డుల్లో ఓటర్లు తారుమారయ్యారు. 12వ వార్డులో ఏకంగా 4700కు పైగా ఓటర్లు ఉండడంతో అక్కడి ఓటర్లతో పాటు పోటీ చేయబోయే అభ్యర్థులు ముక్కున వేలేసుకుంటున్నారు. 35, 10వ వార్డుల నుంచి ఓటర్లను 12వ వార్డులోకి తారుమారు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతర గ్రామాల నుంచి సైతం పట్టణ ఓటరు జాబితాలో పేర్లు చేర్చినట్టుగా తెలుస్తోంది.

## జిల్లాలో అభివృద్ధి పనులపై సీఎంను కలిసిన పీసీసీ చీఫ్, ఎమ్మెల్యేలు



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ మేరకు మంగళవారం సీఎం క్యాంప్ ఆఫీస్‌లో పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా సీఎంకు వినతిపత్రం అందజేశారు. నిజామాబాద్ నగరంతో పాటు బాల్కొండ నియోజకవర్గంలోని రహత్‌నగర్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్, కళాశాల మంజూరు చేయాలని వారు కోరారు. నిజామాబాద్ నగరంలో అదనంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, మరో ఐటీ టవర్, అదే విధంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను త్వరగా పూర్తిచేసే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎంను కోరారు.

## వీడీసీల ఆగడాలను అరికట్టాలి: ఎమ్మెల్సీ సత్యం



**అక్షరటుడే, ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్‌లో గ్రామాభివృద్ధి కమిటీల (వీడీసీ) ఆగడాలను అరికట్టాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. శాసనమండలి సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి కమిటీల పేరుతో ప్రజలపై సాగిస్తున్న దౌర్జన్యాల గురించి శాసనమండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో వీడీసీల పేరిట ఎస్సీ, ఎస్టీలను బీసీ వర్గాలలోని గౌడ, ముదిరాజ్, యాదవ, చాకలి, మంగలి సామాజిక వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎమ్మెల్సీ వివరించారు. జిల్లా కలెక్టర్, పోలీసులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు లేవన్నారు. తక్షణమే వీడీసీల ఆగడాలకు కళ్లెం వేయాలని కోరారు. దీనిపై శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్ స్పందిస్తూ గ్రామ అభివృద్ధి కమిటీల దౌర్జన్యాలు అరికట్టేందుకు కలెక్టర్, పోలీస్ యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.






## తులం బంగారం హామీ ఏమైంది..: ఎమ్మెల్యే

**అక్షరటుడే, భీమ్‌గల్ :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 'తులం బంగారం' హామీని తక్షణమే నెరవేర్చాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. భీమ్‌గల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం బాల్కొండ నియోజకవర్గానికి చెందిన సుమారు 429 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో ఆడబిడ్డ పెళ్లి భారం కాకూడదనే ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్ మేనమామ కట్నంలా రూ.1,00,116 అందించే పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని నమ్మబలికి రెండేళ్లు గడిచినా ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. మహిళలకు రూ.2,500 జీవన భృతి, రూ.4,000 పెన్షన్, తులం బంగారం వంటి హామీలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని వేముల ఆరోపించారు. అసెంబ్లీ వేదికగా తాము ప్రశ్నిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు.

## పాఠశాలలో ఫుడ్ పాయిజన్.. పలువురు విద్యార్థులకు అస్వస్థత

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన నాగిరెడ్డి పేట మండల మాల్తుమ్మెద ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం ఎనిమిది మంది విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. భోజనం చేశాక తీవ్రంగా వాంతులు చేసుకోవడంతో స్పందించిన ఉపాధ్యాయులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం హుటాహుటిన ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో ప్రస్తుతం విద్యార్థులకు వైద్యం అందిస్తున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను ఆర్డీవో పార్థసింహారెడ్డి పరామర్శించారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.



## ఎస్ఐఆర్ అమలులో పురోగతి సాధించాలి

**అక్షరటుడే, ఇందూరు:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక ప్రక్రియను ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. అర్బన్ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ అమలు తీరు, ముసాయిదా ఓటరు జాబితాపై మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏఈఆర్‌వోలు, బీఎల్‌వో, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఎస్ఐఆర్ అమలును పరిశీలిస్తూ వెనుకంజలో ఉన్న వారి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నియమ నిబంధనలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. అర్బన్ పరిధిలోని 301 పోలింగ్ కేంద్రాల పరిధిలో స్పష్టమైన ప్రగతి సాధించాల్సిందేనన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రం వారీగా బీఎల్‌వోలతో మ్యాపింగ్‌ను పక్కాగా జరిపించాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా నిశితంగా పరిశీలించాలన్నారు. వారంలో మళ్లీ సమీక్ష నిర్వహిస్తారని, లోటుపాట్లను సరిదిద్దాలని కలెక్టర్ సూచించారు. ఓటరు జాబితా పూర్తి పారదర్శకంగా ఉండాలని ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగకుండా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జాబితాపై ఫిర్యాదులు వస్తే సంబంధిత బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లను బాధ్యులుగా పరిగణిస్తామని హెచ్చరించారు. నూతనంగా విలీనమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.




## ఏసీబీకి చిక్కిన నాగిరెడ్డిపేట తహశీల్దార్

**అక్షరటుడే, లింగంపేట :** కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం తహశీల్దార్ యార్లగడ్డ శ్రీనివాస్ రావు ఏసీబీకి చిక్కారు. ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ వ్యక్తి వ్యవసాయ భూమిని తన పేరున బదిలీ చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నాడు. కాగా.. బదిలీ చేయాలంటే డబ్బులు ఇవ్వాలని తహశీల్దార్ డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడి ఏసీబీని ఆశ్రయించాడు. మంగళవారం రూ. 50వేల లంచం డబ్బులు అజయ్ అనే ప్రైవేటు వ్యక్తి తీసుకుంటుండగా అనిశా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాస్ రావు, ప్రైవేటు వ్యక్తి అజయ్‌లను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారిని హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టుకు తరలించారు.



## నందిపేట బంద్ ప్రశాంతం





**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్టీసీ బస్‌డిపో కోసం మంగళవారం నందిపేట బంద్ నిర్వహించారు. వివిధ సంస్థలు, వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఉదయం 6 గంటల నుంచే ఉద్యమకారులు రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు. బంద్ నేపథ్యంలో అంగళ్లు, విద్యాసంస్థలు, ప్రైవేటు కార్యాలయాలు మూసివేసి యజమానులు తమ మద్దతు ప్రకటించారు. ఆటోలు, ప్రైవేట్ వాహనాలు నిలిచిపోవడంతో మండల కేంద్రంలోని వీధులన్నీ జనసంచారం లేక వెలవెలబోయాయి. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్ ఫేర్ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుంటారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను జిల్లాస్థాయికి, జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్రస్థాయికి పంపిస్తుంటారు. పలు పాఠశాలల నుంచి ఈ ప్రక్రియను ప్రతి ఏడాది నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతిసారి జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ జరిగే కామారెడ్డి ఈసారి రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్‌కు వేదికగా మారింది. బుధవారం నిర్వహించే రాష్ట్రస్థాయి కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు తరలిరానున్నారు. – అక్షరటుడే, కామారెడ్డి



# కామారెడ్డిలో రేపటి నుంచి రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్

■ మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభం ■ కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ■ పలు జిల్లాల నుంచి పాల్గొననున్న విద్యార్థులు ■ విద్యార్థులకు వసతుల ఏర్పాటు

కామారెడ్డి పట్టణంలోని విద్యానికేతన్ పాఠశాలలోని మైదానంలో నిర్వహించనున్న సైన్స్‌ఫేర్ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకు దాదాపు 160 వరకు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. బుధవారం ఉదయం 9 గంటల వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగనుంది. సైన్స్ ఫేర్‌లో సుమారుగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 1800 మంది విద్యార్థులు పాల్గొననున్నారు.

### విద్యార్థులకు ప్రత్యేక వసతులు

రాష్ట్ర నలుమూలల నుంచి సైన్స్ ఫేర్‌లో పాల్గొనే విద్యార్థులకు జిల్లా అధికారులు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు. పాఠశాల నుంచి సైన్స్ ఫేర్ నిర్వహించే విద్యానికేతన్ పాఠశాల వరకు రావడానికి, తిరిగి వెళ్లడానికి ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేశారు.

### తరలివస్తున్న విద్యార్థులు

సైన్స్‌ఫేర్ కార్యక్రమంలో పాల్గొనేందుకు దూర ప్రాంత జిల్లాల నుంచి విద్యార్థులు ఇప్పటికే విద్యానికేతన్ పాఠశాలకు ప్రత్యేక వాహనాలలో చేరుకుంటున్నారు. ఇప్పటికే పలు జిల్లాల నుంచి విద్యార్థులు బయలుదేరినట్లుగా తెలుస్తోంది. రాత్రి వరకు విద్యార్థులు చేరుకునే అవకాశాలు ఉన్నాయి. వివిధ జిల్లాల్లో జిల్లాస్థాయి సైన్స్ ఫేర్‌లో ఎంపికైన విద్యార్థులు కామారెడ్డిలో నిర్వహించే రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్‌లో పాల్గొననున్నారు.



### హాజరుకానున్న మంత్రి సీతక్క

జిల్లాకేంద్రంలోని విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా సీఎం నుంచి మంత్రులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు, ముఖ్య నాయకులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ప్రారంభానికి రాకున్నా ముగింపు కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. బుధవారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క చేతుల మీదుగా సైన్స్ ఫేర్ కార్యక్రమం ప్రారంభించనున్నారు. మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ షెట్కార్ పాల్గొననున్నారు.



### ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

జిల్లా కేంద్రంలో నిర్వహించే సైన్స్ ఫేర్ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. కలెక్టర్ ఛైర్మన్‌గా, కన్వీనర్‌గా డీఈవో, కో-కన్వీనర్‌గా డీఎస్‌వో కొనసాగనున్న ఈ కార్యకమానికి 256 మంది ఉపాధ్యాయులను ఇన్‌ఛార్జీగా నియమించారు. సైన్స్ ఫేర్ జరిగే మైదానంలో భారీగా షామియానాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు భోజన వసతి కోసం ప్రత్యేకంగా టెంట్ ఏర్పాటు చేసి భోజనాల కోసం విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు 18 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులకు తాగునీటి వసతి, ఇతర వసతులు ఏర్పాటు చేశారు.



## బీటీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని పలువార్డుల్లో అభివృద్ధి పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. అంగడి బజార్ నుంచి జావిద్ భాయ్ మినీ స్టేడియం, ఆటో స్టాండ్, జిరాయత్ నగర్ వరకు బీటీ రోడ్డు పనులను 15వ వార్డులో జిమ్మి రవి, 16వ వార్డులో తహసీన్ అహ్మద్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రైస్ భాయ్, అబ్దుల్ మోసిన్, మజీద్, సాజిద్, షహీద్, నదీం, బహదూర్ పాల్గొన్నారు.



## కొత్తపల్లిలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ప్రజాబాట

**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఎస్ఈ రాజేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించి పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిశాంత్, ఉప సర్పంచ్ సురేష్ గౌడ్, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ శ్రీనివాస్, సబ్ ఇంజినీర్ కాంతారావు పాల్గొన్నారు.

### పోచంపాడ్‌లో..




పోచంపాడ్‌లో మంగళవారం ప్రజాబాట నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్య అతిథులుగా ఎన్పీడీసీఎల్ డీఈ రఘు, సబ్ ఇంజినీర్ ప్రసాద్, లైన్‌మెన్లు కిషోర్, అజర్, శివ, రవి హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాధురి రాజు, ఉపసర్పంచ్ సంపంగి సతీష్, గ్రామస్థులు సంగీత్, నజీర్ పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్ కేసులో పలువురికి జరిమానా

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి పలువురిని పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేయగా పదిమంది మద్యం తాగి పట్టుబడ్డారన్నారు. వారిని మంగళవారం ఉదయం కోర్టులో హాజరుపర్చగా రూ.10వేల చొప్పున రూ.90వేల వరకు జరిమానాలు విధించారు. అలాగే ఒకరికి 7 రోజుల జైలుశిక్ష విధిస్తూ ఆర్మూర్ మెజిస్ట్రేట్ భవ్యశ్రీ తీర్పునిచ్చారని చెప్పారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, బాల్కొండ:** పట్టణంలో పలువురు లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి సహకారంతో తొమ్మిది మంది లబ్ధిదారులకు రూ. 5లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బాల్కొండ పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తౌటు అరవింద్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్, వార్డు సభ్యులు పిట్ల దయాకర్, నవీన్ కుమార్, నాయకులు తౌటు గంగాధర్, యూనస్, కుందారం శ్రీనివాస్, గోపు ఉషన్న, మజారుద్దీన్, వహబ్, రియాజ్, డి.సాయన్న, పద్మారావు, పిప్పర అశోక్, మెట్టు అశోక్, నరేష్, షోయబ్, నల్లగంగు పాల్గొన్నారు.

## బాల్కొండ కేజీబీవీలో సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**అక్షరటుడే, బాల్కొండ:** మండల కేంద్రంలోని కేజీబీవీని సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ప్రతి తరగతికి వెళ్లి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. అనంతరం పాఠశాల పరిసరాలు, వంటగది, డైనింగ్ హాల్, హాస్టల్ గదులు, మరుగుదొడ్లు తదితర విభాగాలను సైతం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, పరిశుభ్రతపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యారాలు భవాని, సిబ్బందిని అభినందించారు.



## దొంగ ఓట్లను తొలగించాలని సబ్ కలెక్టర్ ఆఫీస్ ఎదుట బీజేపీ ధర్నా



**అక్షరటుడే, బాన్సువాడ :** మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో దొంగ ఓట్లను తొలగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కోణాల గంగారెడ్డి మాట్లాడుతూ.. బాన్సువాడ పట్టణంలోని 9వ వార్డులోని ఓట్లను ఒకటో వార్డులోకి వెళ్లాయన్నారు. అలాగే ఆరో వార్డులో ఏకంగా 400 ఓట్లు పెరిగాయన్నారు. ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు అధికారులు ఇలా ఓట్లను తారుమారు చేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్ర అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చీదర సాయిలు, నాయకులు శంకర్ గౌడ్, చిరంజీవి, ఉమేష్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ డాకయ్య, మహేష్, రామకృష్ణ, అనిల్, శివశంకర్, శ్రీకాంత్, రాజాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## 'కామారెడ్డి మున్సిపాలిటీలో దొంగఓట్లతో గెలిచేందుకు కుట్ర..'



**అక్షరటుడే, కామారెడ్డి :** కామారెడ్డి పట్టణంలో బీజేపీ బలంగా ఉందని, అందుకే అధికార పార్టీ దొంగ ఓట్లతో గెలిచేందుకు కుట్ర చేస్తోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఓటరు జాబితాను సవరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఇన్‌ఛార్జి కమిషనర్ వచ్చి బీజేపీ నాయకులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఓటరు జాబితాలో తప్పులుంటే అభ్యంతరాలు ఇవ్వాలని సూచించారు. ఒక వార్డు నుంచి మరొక వార్డుకు మారిన ఓటర్ల అంశంపై స్పందిస్తూ వార్డు ఆఫీసర్ల తప్పిదమేనన్నారు. ఫీల్డ్ వెరిఫికేషన్ సరిగా చేయకపోవడం వల్ల అలా జరిగి ఉంటుందన్నారు. బౌండరీలు తెలియక కూడా తప్పులు జరిగాయని కమిషనర్ తెలిపారు. తప్పులు సవరించి 10వ తేదీన ఎన్నికల కమిషన్‌కు ఓటరు జాబితా సమర్పిస్తామని తెలిపారు.

## ఆర్మూర్‌లో అదనపు జిల్లాకోర్టు ఏర్పాటు చేయాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ న్యాయస్థానంలో అదనంగా అడిషనల్ జిల్లా కోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ ఆర్మూర్ బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా న్యాయమూర్తి భరత లక్ష్మికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, గ్రంథాలయ కార్యదర్శి కుందారం శ్రావణ్ కలిసి విన్నవించారు. ఆర్మూర్ కోర్టులో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు విషయమై హైకోర్టుకు సిఫారసు చేస్తానని ఆమె సానుకూలంగా స్పందించారు. దీంతో న్యాయమూర్తికి బార్ అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

## గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తా



**అక్షరటుడే, భీమ్‌గల్:** మాజీ మంత్రి శనిగరం సంతోష్ రెడ్డి కుమారుడు శనిగరం వాసు బాబు బాల్కొండ మండలంలోని గోనుగొప్పుల గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. సుదీర్ఘ కాలం తర్వాత గ్రామానికి విచ్చేసిన ఆయనకు గ్రామస్థులు, పాత మిత్రులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గ్రామ అభివృద్ధిపై స్థానిక నాయకులతో చర్చించి, ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాసు బాబు మాట్లాడుతూ.. తన తండ్రికి రాజకీయ జన్మనిచ్చిన ఈ ప్రాంతం అంటే తనకు ఎంతో మక్కువన్నారు. గోనుగొప్పుల గ్రామ అభివృద్ధికి తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ చెరుకుపల్లి నరసింహారెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోజాగౌడ్, గోనుగొప్పుల సర్పంచ్, బాల్కొండ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చరణ్ గౌడ్, నాయకులు యూసుబ్, అజయ్ గౌడ్, వంశీ గౌడ్ పాల్గొన్నారు.

## సర్పంచ్‌లు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**అక్షరటుడే, ఆర్మూర్ :** సర్పంచ్‌లు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీవో గంగాధర్ సూచించారు. ఆలూర్ మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలు, గ్రామాభివృద్ధి పనుల ప్రణాళిక, ప్రజా సమస్యల పరిష్కారంలో సర్పంచ్‌ల పాత్రపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ, రహదారుల సంరక్షణ, పన్నుల వసూలు, అభివృద్ధి పనుల్లో పారదర్శకత వంటి సర్పంచ్‌ల విధులు, బాధ్యతల గురించి వివరించారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్‌లు అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీవో సూచించారు. శిక్షణ అనంతరం ఎంపీడీవో గంగాధర్ సర్పంచ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో రాజలింగం, సర్పంచ్‌లు ముక్కెర విజయ్, యల్లా సాయిరెడ్డి, కట్ట నర్సయ్య, నడ్పి గంగాధర్, మచర్ల చిన్నయ్య, పుష్ప, గంగోల్ల సుస్మిత, కొండ్ర కమల, భూషణ్, జీపీ కార్యదర్శులు కిషోర్, చంద్రశేఖర్, దినేష్, నాగేంద్ర, నసీర్, నవీన్, వందన, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



## ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రచారం

**అక్షరటుడే, ఆర్మూర్:** రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో గ్రామాల్లో హిందుత్వంపై ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు నందిపేట్ మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హిందుత్వంపై ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు అందజేశారు. వందేళ్లలో ఆర్‌ఎస్‌ఎస్ సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు సంఘ్ సేవక్‌లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

